మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట





# జూన్‌లోనూ.. తగ్గేదేలే..!

- తన ప్రతాపాన్ని చూయిస్తున్న భానుడు
- దంచికొడుతున్న ఎండలు
- మరో మూడు రోజులు వడగాలులు
- వెల్లడించిన వాతావరణ శాఖ..
- పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రుల ఆందోళన..
- జూన్ మూడో వారంలోనూ కానరాని 'నై'రుతి..

జూన్‌లోనూ భానుడు తన ప్రతాపాన్ని చూయిస్తున్నాడు..ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడంలేదు. రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయి అనే సామెత ఉన్నది..రోహిణి కార్తె పోయి మృగశిర కార్తె వచ్చినా సూర్యతాపం చల్లారకపోవడంతో మృగశిరలోనూ రోళ్లు పగిలేలా ఎండలు మండుతున్నాయి. మరో మూడు రోజులు వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడం కొంత ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇప్పటికే వర్షాలు మొదలై అన్నదాతలు విత్తులు విత్తుకోవాల్సిన సమయం వరుణదేవుడు కానరాకపోవడంతో ఇటు రైతులు సైతం ఆందోళన చెందుతున్నారు.

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** ఈ ఏడాది ఉష్ణోగ్రత గరిష్ఠానికి చేరుకున్న విషయం తెలిసిందే..అయితే జూన్ మొదటి, రెండో వారంలోనే ఏటా వర్షాలు కురుస్తాయి.. ఈసారి అందుకు భిన్నంగా వాతావరణం ఉన్నది. రెండు వారాల కింద ఒక సారి వర్షం పడినా మురిపించినా మళ్లీ వర్షాలు జాడలేకపోవడంతో అన్నదాతలు సైతం ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో తాజా వాతావరణ శాఖ మరో మూడు రోజులు వడగాలులు వీస్తాయని తెలుపడంతో ఇటు విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ,అటు అన్నదాతల్లోనూ ఆందోళన కలిగిస్తున్నది. చాలా వరకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఒక పూట మాత్రమే పంపిస్తున్నట్లు చెబుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా పిల్లలు డీహైడ్రేడ్ అయ్యే అవకాశం ఉండడంతో మధ్యాహ్నం తర్వాత ఇంట్లోనే ఉండేలా చూస్తున్నారు. ఈనెల 14న మూడు రోజుల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించగా నేటికీ ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు.

**మందకొడిగా 'నై'రుతి..**

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మందకొడిగా ముందుకు కదులుతున్నాయి. మోకా, బిపర్‌జోయ్ తుఫానులు ప్రతిబంధకాలుగా మారాయి. దీని ఫలితంగా ఒక వైపు వడగాలులు విజృభిస్తుండగా, మరోవైపు వర్షాలు ఆగిపోయాయి. నైరుతి రుతుపవనాలు కేరళ, కర్ణాటక,ఏపీ, తమిళనాడులోకి ప్రవేశించినా మందకొడిగా కదులుతున్నాయి. ఇప్పటికే రాయలసీ, కోస్తా ఆంధ్రా మీదుగా తెలంగాణలోకి ప్రవేశించాల్సిన రుతుపవనాలు ఆ దిశగా పూర్తిగా విస్తరించలేదు. ఈనెల 20 తర్వాత రాష్ట్రంలోకి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు ఆలస్యం కావడంతో ఇటు అన్నదాతల్లో ఆందోళన నెలకొన్నది. ఇప్పటికే విత్తనాలు, ఎరువుల దుకాణాలు కిటకిట లాడుతూ అన్నదాతలు చేతినిండా పనితో బిజీబిజీగా ఉండాల్సిన సమయం. రుతుపవనాలు మందకొడిగా కదలడం వల్ల వరుణుడు మొహం చాటేశాడు.

**మరో మూడు వడగాలులు..**

రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు పెరిగిపోతున్నాయి. మరో మూడు రోజులు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. చిన్న పిల్లలు, వృద్ధులు సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండాలని సూచిస్తున్నది. రాష్ట్రంలోని 20జిల్లాలకు పైగా ఆరంజ్ జోన్ (40-45డిగ్రీలు)లోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. చాలా ప్రాంతాల్లో గరిష్ఠంగా 41డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని అయిదు జిల్లాల్లో మాత్రం ఎల్లో జోన్ (40డిగ్రీల లోపు) పరిధిలోనే ఉండనుండడం కాస్త ఉపశమనం కలిగించే అంశం. అయితే జూన్ 20వరకు పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం పడొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# మిషన్ భగీరథతో సురక్షితమైన తాగునీరు...

**- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



మిషన్ భగీరథ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి, జూన్ 18 ప్రభాతవార్త:** మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మిషన్ భగీరథ దినోత్సవాన్ని కల్వకుర్తి పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తాగునీటి సమస్యతో దశాబ్దాల పాటు ఇబ్బందులు పడ్డ ప్రజలకు స్వరాష్ట్రంలో మిషన్ భగీరథ ద్వారా సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. సీఎం కృషితో నేడు ప్రతి గ్రామంలో ప్రతి ఇంటింటికి తాగునీరు అందుతుందన్నారు. గత పాలకుల పాలనలో తాగునీటి కోసం మహిళలు కుళాయిల వద్ద గొడవలు పడుతుండేవారని, సీఎం కేసీఆర్ మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధ జలాలు అందించారన్నారు. వేసవి కాలం వచ్చిందంటే వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి బారులు తీరి తాగునీటిని తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడేవారని, మహిళల గోడును పట్టించుకొని మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మహిళల అభ్యున్నతి కోసం పెద్దపీట వేస్తూ అన్ని రంగాల్లో పురుషులతో పాటు సమానంగా మహిళలను తీసుకొని రావాలనే ఉద్దేశంతో మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. మిషన్ భగీరథ దశాబ్ది ఉత్సవాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ సామ మనోహర, ఎఎంసీ చైర్మన్ విజయ్‌గౌడ్, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ కొందూర్ గోవర్ధన్, నియోజకవర్గంలోని ఆయా మండలాల, గ్రామాల ప్రజా ప్రతినిధిలు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# శుద్ధజలం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ..!

**గతంలో నీళ్లకోసం కిలోమీటర్ల మేర బారులు**
**నేడు ఇంటివద్ద నల్ల తిప్పితే మంచినీరు**
**మన్యంకొండ వద్ద మంచినీళ్ల పండగలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూన్ 18 ప్రభాతవార్త :** వందశాతం ఇంటింటికి మంచినీరు ఇస్తున్న రాష్ట్రం, 80 శాతం రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా ఈనెల 2 నుండి 22 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం మన్యంకొండలో మిషన్ భగీరథ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద నిర్వహించిన మంచినీళ్ల పండగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తాగునీటి కోసం మహిళలు కిలోమీటర్ల దూరం నడిచి బిందె మీద బిందె పెట్టుకుని తెచ్చుకున్న పరిస్థితులు ఉండేవని, అప్పుడు నీటిని ఏ విధంగా వినియోగించుకున్నామో ఇప్పుడు అదేవిదంగా వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధికి గుర్తుగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను చేసుకుంటున్నామని, ముఖ్యంగా ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి ఇంటింటికి తాగునీరు అందించే మిషన్ భగీరథ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టారని, ఇది ఏ రాష్ట్రంలో లేదని, ఇది దేశం యావత్తు ప్రశంసిస్తున్న పథకం అన్నారు. అన్ని నీటిశుద్ధి కేంద్రాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా మంచినీళ్ల పండగ నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు మిషన్ భగీరథ మంచినీటిని ఇంటింటికి ఇవ్వడానికి పడుతున్న శ్రమను, ఖర్చును, పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రత్యేకించి మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణానది తిరుగుజలాల నుంచి శ్రీశైలం వద్ద ఎల్లూరు రిజర్వాయర్‌ను నిర్మించి అక్కడి నుండి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని తీసుకువచ్చి మన్యంకొండ నీటిశుద్ధ కేంద్రం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు నారాయణపేట జిల్లాకు తాగునీరు అందించడం జరుగుతుందని మన్యంకొండ డబ్ల్యూటిపి వద్ద నాలుగైదు పద్ధతుల ద్వారా నీటిని శుద్ధి చేసి అందించడం జరుగుతుందని తెలిపారు. మిషన్ భగీరథ తాగునీరు మినరల్ వాటర్ కన్నా గొప్పదని, ఎన్నో మినరల్స్ ఈ నీటిలో ఉన్నాయని, కృత్రిమంగా దేవుడిచ్చిన వరప్రసాదంగా వచ్చిన ఈ నీరు ఎంతో శ్రేష్టమని, అందువల్ల ప్రతి ఒక్కరూ మిషన్ భగీరథ తాగునీటిని వాడాలని కోరారు. మిషన్ భగీరథ తాగునీటిని శుద్ధి చేసేందుకు ఎంతోమంది ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలో గతంలో 14 రోజులకు ఒకసారి తాగునీరు వచ్చేదని ఇప్పుడు ప్రతిరోజు వస్తున్నదని అలా అని నీటిని వృధా చేయవద్దని సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా కుళాయిలు లేకుంటే తక్షణమే కొళాయిలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాకలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాకముందు తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఇప్పుడు ప్రతిరోజు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు పొందుతున్నారని అన్నారు. మంచినీళ్ల పండగ సందర్భంగా నీటిశుద్ధి కేంద్రాల వద్ద తాగునీరు ఎలా వస్తుందో ఎలా శుద్ధిచేస్తారో ఇంజనీరింగ్ అధికారులు తెలియజేస్తారని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 826 ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించడం జరుగుతుందని, దీనికి గుర్తుగా ఓహెచ్‌ఎస్‌ఆర్ నుండి గ్రామంలోకి ర్యాలీగా వచ్చి అక్కడ సమావేశాన్ని నిర్వహించుకుని ప్రతిరోజు తాగునీరు ఇస్తున్న వాటర్‌మెన్‌లకు సత్కారం చేయడంతో పాటు, రాష్ట్ర రాజధానిలో సైతం మంచినీళ్ల పండగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. గతంలో నీళ్ల లేనప్పుడు సుదూర ప్రాంతాల నుండి నీళ్లు తెచ్చుకుని ఏ విధంగా జాగ్రత్తగా వినియోగించుకున్నామో ఇప్పుడు అదేవిదంగా వాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లను సుమారు రెండు లక్షల కిలోమీటర్ల మేర వేయడం జరిగిందని, ప్రతిరోజు తాగునీటిని శుద్ధిచేస్తూ ప్రజలకు అందించడం జరుగుతున్నదని వీటన్నింటి గురించి ప్రజలు తెలుసుకోవాలని, అదేవిధంగా మన్యంకొండ దేవాలయానికి వచ్చిన భక్తులందరు పక్కనే - మిగతా4లో..



వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

# భగీరథ జలం ఆరోగ్య ఫలం...

**-ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 18 ప్రభాతవార్త:** అసాధ్యం అనుకున్న మంచినీటి సరఫరా పథకాన్ని రూ.2లక్షల కిలోమీటర్ల పైపులైన్ ద్వారా మంచినీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ప్రభుత్వవిఫ్,అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. భగీరథుడు, సీఎం కేసీఆర్ మానసపుత్రిక మిషన్ భగీరథ పథకం దశాబ్దాల నీటి గోసను తీర్చింది, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన పథకం నేడు పల్లెల్లో సత్ఫలితాలనిస్తూ కొండలు, కోనలు, గుట్టలు దాటి వేల కిలో మీటర్లు ప్రయాణించి నట్టింట సాక్షాత్కరిస్తున్నారు. తాగునీరు ఇంటి ఆవరణలో గల గల పారుతుంటే గిరిజనులు చిరునవ్వులు చిందిస్తూ తమ అవసరాలు తీర్చుకుంటూ ప్రభుత్వ పథకాలతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని గౌరిదేవీపల్లి 77 ఎంఎల్‌డీ మిషన్ భగీరథ ప్లాంటులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విజన్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారన్నారు. రానున్న రోజుల్లో డాక్టర్లకు కొదవ లేకుండా ప్రజారోగ్యం మరింత పకడ్బందిగా కొనసాగుతుందని, అందుకు నిదర్శనం జిల్లాలో మెడికల్ కళాశాల ప్రారంభం కావడమేనని ఆయన అన్నారు. తెలంగాణ దశాబ్ద కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతోనే ఎన్నో పథకాలను రూపకల్పన చేసిందన్నారు. దశాబ్ది ఉత్సవాలను ప్రజాధనంతో నిర్వహిస్తున్నారని ప్రతిపక్షలు విమర్శలు చేస్తున్నాయని, కానీ భారత స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మనం ప్రభుత్వ నిధులతోనే సంబురాలు చేసు కున్నామని, ప్రభుత్వ ధనంతో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాధనాన్ని వినియోగించుకునేలా వెసులుబాటు రాజ్యాంగం కల్పించిందన్నారు. సీఎం కేసీఆర్ తప్పనిసరిగా రుణమాఫీని చేసి తీరుతారన్నారు. డాక్టర్లు, యువత రాజకీయల్లోకి రావాలని ఆయన సూచించారు. రైతు భీమా, రైతుబంధు పథకాలతో ప్రజల చిరునవ్వులను ఆకాంక్షిస్తున్న ప్రభుత్వం మాది అన్నారు. మంచినీటి పండుగ కార్యక్రమానికి రెండు నియోజకవర్గాల గ్రామాల సర్పంచ్‌లు, నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల విద్యార్థులు హజరై శుద్ధి నీటి వివరాలను తెలుసుకున్నారు. మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులు అరుణ్, పవణ్‌కళ్యాణ్‌ల ప్రసంగాలు, పాటలు పలువురిని అలరించాయి. అనంతరం పలు పూల, పండ్ల మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సుధాకర్‌సింగ్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నరసింహగౌడ్, డీఈ హేమలత, సర్పంచ్ తిరుపతయ్య, పదర జెడ్పీటీసీ రాంబాబు, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ భరత్‌రెడ్డి, లుక్యానాయక్, ఏఈలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

# మిషన్ భగీరథతో గద్వాల, అలంపూర్ ప్రాంతాల్లో తాగునీరు..

**మంచినీళ్ల పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్**

**ధరూర్,జూన్ 18 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని జూరాల ప్రాజెక్టు చింతరేవుల మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ వద్ద తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన మంచినీళ్ల పండగ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ అపూర్వరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నేడు మంచినీళ్ల పండగ నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో స్వరాష్ట్రంలో తాగునీటి కష్టాలు తీరాయని అన్నారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తాగునీటి పంపిణీలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర జల్‌శక్తి మంతిత్వ శాఖ ప్రశంస అందించిందని, నీళ్ల ట్యాంకర్ల వద్ద బిందెడు నీటికోసం ఆడబిడ్డల సిగపట్లు, కిలోమీటర్ల దూరం నడిచి వాగులు, వంకల్లో చెలిమలు తవ్వుకుని నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు, వ్యవసాయ బావులవద్ద నీటి కోసం భగీరథ యత్నాలు ఇదంతా ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ప్రజలు పడిన కన్నీటి కష్టాలు మనిషి బతికేందుకు అత్యవసరమైన నీటి వసతి కల్పించడంపై నాటి పాలకుల నిర్లక్ష్యంతో నాడు బిందెడు నీటికోసం ఆపసోపాలు పడేవారన్నారు. తమ నీటి వెతలు తీర్చిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిల్ప ప్రభాకర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ సరోజ రమేష్ నాయుడు, జడ్పీటిసిలు రాజశేఖర్, కాశపోగు రాజు, ఎంపిపిలు మనోరమ, నజీమున్నిసాబేగం, లలితమ్మ, వైస్ ఎంపిపిలు సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణనాయుడు, గ్రిడ్ డివిజన్ ఈఈ భీమేశ్వరరావు, ఇంట్రా ఈఈ శ్రీధర్‌రెడ్డి, డిఈ రవిచంద్రకుమార్, నాగరాజు, వెంకట్రాములు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి

# తాగునీటి గోస తీరింది..!

- తాగునీటికి ట్యాంకర్ల వద్ద గొడవలు జరిగేవి
- చెక్‌డ్యంల నిర్మాణంతో భూగర్భ జలం పెరిగింది
- పాలమూరు పూర్తిచేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం
- పందిరిగుట్ట వద్దనీళ్ల పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ సందర్శన

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త :** 2014కు ముందు జడ్చర్ల పట్టణ, గ్రామాల్లో తాగునీటికి చాలా తిప్పలు పడ్డారని, నీళ్ల ట్యాంకర్ల వద్ద ఆడబిడ్డలు కొట్లాడుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ దుస్థితి ఉందా ఒకసారి ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోని పందిరిగుట్ట వద్ద తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన నీళ్ల పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కెసిఆర్ దూర దృష్టితో మిషన్ భగీరథ పథకం ద్వారా నేడు ప్రతి ఇంటికి తాగునీళ్లు అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి పంచాయతీకి వాటర్ ట్యాంక్ నిర్మించి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. కల్వకుర్తి ఎత్తి పోతల పథకాన్ని పూర్తి చేసుకుని మిడ్జిల్, ఊరుకొండపేట మండలాలకు సాగునీళ్ల అందించామన్నారు. మిడ్జిల్ మండలంలో రూ. 35 కోట్లతో 6 చెక్‌డ్యాంల నిర్మాణం ద్వారా భూగర్భ జలం,5వేల ఎకరాల ఆయకట్టు పెరిగిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కరివెన రిజర్వాయర్ పనులు తుది దశకు చేరుకున్నాయని, తదనంతరమే ఉదండాపూర్ ప్రాజెక్టు కూడాపూర్తి చేసుకుని నియోజకవర్గంలో 1,50,000 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అంతకుముందు నిమ్మబావిగడ్డ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద నూతనంగా 3 ఎంఎల్‌డి వాటర్ పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే గేట్‌వాల్ తప్పి ప్రారంభించారు. దీనివల్ల ప్రతిరోజు పట్టణానికి సరఫరా అయ్యే 7 ఎంఎల్‌డి వాటర్‌కు అదనంగా 3ఎంఎల్‌డి వాటర్ సరఫ్రా కానున్నదని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ వాటర్ - మిగతా4లో..



వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# గాలి,నీరు స్వచ్ఛమైనవి అందించడానికి సీఎం కేసీఆర్ కృషి..!

- మానవాళికి గాలి, నీరు జీవనాధారం
- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకే మిషన్ భగీరథ
- మిషన్ భగీరథ సమస్యలు పరిష్కరించడానికి గ్రామానికి ఒక మొబైల్ టీం ఏర్పాటు
- జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి
- వనపర్తి జిల్లాకు ఎంతటి కరువు వచ్చిన తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందుచూపుతో ఎల్లూరు రిజర్వాయర్ నుండి వనపర్తికి తాగునీరు
- ప్రజలు, విద్యార్థులు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను సందర్శించి, మిషన్ భగీరథ నీరు ఏవిధంగా వస్తుందో అవగాహన ఏర్పరచుకోవాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను సందర్శించిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

**వనపర్తి ప్రతినిధి, జూన్18, ప్రభాతవార్త:** జన జీవనానికి మూలాధారమైన గాలి, నీరు స్వచ్ఛమైనవిగా అందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కృషి చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం కానాయపల్లి మిషన్ భగీరథ జల శుద్ధి కేంద్రం వద్ద నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షత వహించగా జడ్పీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ... మానవాళికి గాలి నీరు జీవనాధారం అన్నారు. ఇలాంటి జీవనాధారం కలిగిన గాలి, నీరు పరిశుభ్రంగా అందించడానికి ముఖ్యమంత్రి తెలంగాణకు హరితహారం మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన గాలి పరిశుద్ధమైన మంచినీరు అందిస్తున్నారు. తెలంగాణ ఏర్పడక ముందు మంచినీళ్ల కొరకు ప్రతి రోజు ఇబ్బందులు ఉండేవని నేడు ప్రతి ఇంటికి శుద్ధమైన మంచినీరు నల్ల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ మంచినీళ్ల సమస్య ఎక్కడైనా ఉందా అని తెలుసుకోవడానికి అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామాలలో పర్యవేక్షిస్తుంటానని చెప్పారు. మిషన్ భగీరథ సమస్యలు పరిష్కరించడానికి గ్రామానికి ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంటారని అవసరమైన గ్రామ పంచాయతీ నిధులు వాడుకోవచ్చని తెలిపారు. వనపర్తి జిల్లాకు మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన తాగునీరు అందించడంలో మిషన్ భగీరథ అధికారులు సిబ్బంది, ముఖ్యంగా సూపరింటెండెంట్ ఇంజనీర్ జగన్మోహన్ విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ... ఇంట్లో నీళ్లు రావు అనే పరిస్థితి నుండి ఇంటింటికి మిషన్ భగీరథ తాగునీరు వస్తుంది అనడానికి సంతోషిస్తున్నానని అన్నారు. వనపర్తి జిల్లాకు సమీప భవిష్యత్తులో శంకర సముద్రం, రంగసముద్రం, జూరాల ఎండి ఎంతటి కరువు వచ్చినా తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ముందు చూపుతో కృష్ణా నది ఎల్లూరు రిజర్వాయర్ నుండి వనపర్తికి తాగునీరు తీసుకువస్తున్నట్లు తెలిపారు. బొగ్గపల్లి తాండా వద్ద 75 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణంలో ఉందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించడం వెనుక ఎంత ఇబ్బందులు , శ్రమ దాగి ఉందో ప్రజలు గ్రహించాలని తెలిపారు. 2690 కిలో మీటర్ల గ్రిడ్ లైన్ 1757 కి.మీ ఇంట్రా పైపులైన్ ద్వారా జిల్లాకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. తాగునీటిని వృధా చేయవద్దని సూచించారు. గ్రామ ప్రజలు విద్యార్థులు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను సందర్శించి మిషన్ భగీరథ తాగునీరు ఏ విధంగా వస్తుందో అవగాహన ఏర్పరచుకోవాలని తెలియజేశారు. మిషన్ భగీరథ నీరు అందించడం వల్ల జిల్లాలో సీజనల్ వ్యాధులు తగ్గిపోయాయని, ఇది మంచి పరిణామమని సంతోషం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ సిబ్బంది, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు మిషన్ భగీరథ ఎస్ఈ జగన్ మోహన్, మిషన్ భగీరథ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ సుఖేషిణి, పెబ్బేరు మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ , ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి, జడ్పీటీసీ శివరంజని, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్ లు మాట్లాడారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, మిషన్ భగీరథ అధికారులు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా కల్పిస్తున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్

**వెల్దండ, జూన్ 18 (ప్రభాతవార్త):** వెల్దండ మండలంలో బాధితులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ ఎన్ ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్ని విధాల అండగా ఉండి భరోసా కల్పిస్తున్నారు. మండల పరిధిలోని ఎంజీకాలనీ తాండకు చెందిన రాత్లావత్ బుజ్జి అనారోగ్యానికి గురై కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఫౌండేషన్ చైర్మన్‌ను సంప్రదించడంతో స్పందించిన రాఘవేందర్‌రెడ్డి వెంటనే బుజ్జి వైద్య ఖర్చుల నిమిత్తం సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, రఘునాయక్, జయరాం, పంతులనాయక్, లక్ష్మణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖచే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్షలు -2024కు కోసం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుతున్నాయి. అభ్యర్థులకు ఆబ్జెక్టివ్ టైప్, అప్టిట్యూడ్ పరీక్షల ద్వారా ఎంపిక చేయనున్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థులు వచ్చేనెల 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## నూతన రేషన్ షాపులను ప్రారంభించిన జడ్పీటిసి

**కోయిల్‌కొండ, జూన్ 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొత్లాబాద్, మల్లాపూర్ గ్రామాలలో ఆదివారం మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి నూతన రేషన్ షాపులను ప్రారంభిం చారు. కొత్లాబాద్ గ్రామంలో రేషన్ షాపు డీలర్‌గా ఉమామహేశ్వరి, మల్లాపూర్ గ్రామ రేషన్ షాపు డీలర్‌గా సుమలతలు తమ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కొన్ని రేషన్ షాపులు ఖాళీగా ఉండడంతో వాటిని భర్తీచేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ షాపు డీలర్లను నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భీంరెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ రాజావర్ధన్‌రెడ్డి, మల్లాపూర్, గ్రామసర్పంచ్ లక్ష్మమ్మ పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ గుంటి పంచముఖి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

**వనపర్తి టౌన్, జూన్18, ప్రభాతవార్త:** వనపర్తి మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ గుంటి పంచముచ ఆంజనేయ స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు మూలవిరాట్‌కు అభిషేకాలు, 9 గంటలకు గణపతి పూజ సుబ్రహ్మణ్యేశ్వర పూజ నవగ్రహ పూజలు, 11 గంటలకు మహా అభిషేకం అర్చన నైవేద్యం, మహా మంగళహారతి మంత్ర పుష్పం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. గోపనపల్లి వాస్తవ్యులు వేణుగోపాల్‌రెడ్డి ధర్మపత్ని పల్లవి ఆదివారం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శారద ఆశన్న నాయుడు, అర్చకులు నవీన్‌శర్మ, భక్తులు లక్ష్మమ్మ , శ్రీనివాసులు గౌడ్, శివకుమార్, శివశంకర్ రెడ్డి, కృష్ణయ్య, నిలయ, శేఖర్, మహేష్, కొత్త రవి, వనపర్తి జిల్లా పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామి వారికి నాలుగు తులాల బంగారం వితరణ

**కెటిదొడ్డి, జూన్ 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామం కొండపై వెలసిన శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయానికి గద్వాల జిల్లాకు చెందిన పోస్టల్ డిపార్టుమెంట్ 2 తులాల బంగారాన్ని ఎం. వరలక్ష్మి భర్త ఎం. వెంకట్‌రెడ్డి, కెటిదొడ్డి మండల పరిధిలోని మైలగడ్డ గ్రామానికి చెందిన భీమయ్య వారి కుమారులు, రెండు తులాల బంగారాన్ని బహూకరించారు. ఆదివారం దేవాలయం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ సభ్యులకు అందజేయగా వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు శేషురెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన జడ్పీ చైర్‌పర్సన్

**గద్వాల ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూరాల ప్రాజెక్టు రేవులపల్లి వద్ద మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్ వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ మంచినీళ్ల పండగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జోగులాంబ గద్వాల జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించి, నీటిశుద్ధి ఏ విధంగా చేస్తున్నారని ల్యాబ్‌లో టెక్నాలజిస్టులతో కలిసి నీటి శుద్ధీకరణ యంత్రాలతో పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన శుద్ధినీళ్ల అందించాలని అధికారులకు జడ్పీ చైర్‌పర్సన్ సరిత సూచించారు.



**చింతరేవుల ఆంజనేయస్వామిని దర్శించుకున్నజడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య**

జోగులాంబ గద్వాలజిల్లా ధరూర్ మండల పరిధిలోని చింతరేవుల ఆంజనేయ స్వామి దేవాలయాన్ని అమావాస్య సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరివెంట గోర్లఖాన్‌దొడ్డి నరసింహారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ధరూర్ రవి, కురువ పల్లయ్య, ఈఓ కవిత, ఆలయ కమిటి చైర్మన్ గిరిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

**వనపర్తి క్రైమ్, జూన్18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్ఐ నాగన్న పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన రాఘవేందర్ గ్రామ శివారులోని తిమ్మగుట్ట సమీపంలో గల రహదారి పక్కన గేదెలు మేపుతుండగా పక్కనే చెట్టు దగ్గర దుర్వాసన రావడంతో రాఘవేందర్ చెట్టు దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ కుళ్లిపోయిన మహిళ మృతదేహం కనిపించడంతో అదే గ్రామానికి చెందిన వీఆర్ఏ బాలస్వామికి వెంటనే సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు. వీఆర్ఏ బాలస్వామి హుటాహుటిన ఎస్ఐ నాగన్నకు సమాచారం అందించినట్లు తెలిపారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మహిళ మృతి చెంది సుమారు వారం రోజులు అయి ఉండొచ్చని అంచనా వేశారు. మృతురాలు బ్లూ కలర్ దుస్తులు ధరించి ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



# మన్యంకొండలో ఘనంగా తిరుచ్చిసేవ..

### - అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి దర్శనం

**దేవరకద్ర, జూన్ 18 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తుల హరినామశ్చరణ, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళీ గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిధ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మాయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్యంకొండలో స్వామివారిని పల్లకిలో తీసుకవస్తున్న పూజారులు



అలంకరణలో శ్రీదేవిభూధేవి

# సీఎం కేసీఆర్ రైతులపై కపట ప్రేమ మానుకోవాలి...

### - బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేందర్‌గౌడ్

**కల్వకుర్తి, జూన్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రైతులపై కపట ప్రేమ మానుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేందర్‌గౌడ్ దుయ్యబట్టారు. ఆదివారం కల్వకుర్తి బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం ఇప్పటికి అనేక మంది రైతులకు డబ్బులు చెల్లించక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దేశంలో నరేంద్రమోడీ రైతు పక్షపాతిగా నిలిచి ఫసల్ భీమా యోజన పథకం ప్రవేశ పెడితే రాష్ట్ర ప్రభుత్వం భీమా పథకంలో తమ వాటా కట్టనందున తెలంగాణ రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం వల్ల ఫసల్ భీమా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.1లక్ష రుణమాఫీ ఏక కాలంలో చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి వడగండ్ల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను వెంటనే పంట నష్ట పరిహారం అంచనా వేసి నష్టపోయిన రైతులందరిని ఆదుకోవాలన్నారు. రైతులకు చెల్లిస్తానన్న రూ.10వేల నష్ట పరిహారాన్ని వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు సబ్సిడీ మీద వస్తున్న వ్యవసాయ పరికరాలను మరియు డ్రిప్ సిస్టం పైపులను వారికి అందుబాటులో ఉంచి రైతులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఎరువులను రైతులకు అందించి రైతుల పక్షాన నిలబడాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో మీకు గుణపాఠం చెప్పడానికి రైతాంగం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బోడ నరసింహ, సీనియర్ నాయకులు మొగిలి దుర్గప్రసాద్, బీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రవి, బీజేపీ పట్టణ అధ్యక్షులు బాబిదేవ్, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేందర్‌గౌడ్

# మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు తీర్చిన ఘనుడు సీఎం కేసీఆర్..

**వెల్దండ, జూన్ 18 ప్రభాతవార్త:** తాగునీటి సమస్యతో దశాబ్దాల పాటు ఇబ్బందులు పడ్డ ప్రజలకు మిషన్ భగీరథతో సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపించారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వెల్దండ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ఆదివారం మిషన్ భగీరథ విజయ దినోత్సవాన్ని ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెల్దండ మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ వద్ద ఉన్న మంచినీటి ట్యాంక్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు గ్రామస్తులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో పాటు ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలు తాగునీటి కోసం గోస పడేవారని, ఎండకాలం వచ్చిందంటే చాలు తాగునీటి కష్టాలు మొదలయ్యేవని, బోరుబావులు, చేతి పంపులు ఎండిపోయి తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోయేవారని, గతంలో తాగునీటి కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితులు ఉండేవని, సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా కృష్ణానదీ నుంచి శుద్ధమైన తాగునీటిని ప్రతి ఇంటికి అందజేసి ప్రజలకు తాగునీటి కష్టాలను దూరం చేశారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లలిత, ఎంపీడీఓ శ్రీనివాసులు సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డికి మిషన్ భగీరథ మెమెంటోను బహుకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, మత్స్యకార సంఘం జిల్లా డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్య, వార్డు సభ్యులు నారాయణరెడ్డి, జాహెద, కుర్మిద్ద యాదగిరి, ప్రసాద్, నిరంజన్, నాగయ్య, దేవేందర్; రఘు, శేఖర్, శివ, ఏఈ రామకృష్ణ, ఎపీఎం రాములునాయక్, ఈశ్వర్‌జీ, మహిళలు తదితరులు ఉన్నారు.



మిషన్ భగీరథపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# ఆరోగ్య జీవనం కోసం మిషన్ భగీరథ నీటిని సేవించండి..

### జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి

**కోయిల్‌కొండ, జూన్ 18 ప్రభాతవార్త :** ఆరోగ్యంగా జీవనం కొనసాగించడానికి మిషన్ భగీరథ మంచినీటిని సేవించాలని మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని శ్రీరామకొండ సమీపంలో గల మిషన్ భగీరథ మంచినీటి శుద్ధి కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన మంచినీళ్ల పండగ కార్యక్రమానికి మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడరాదని మిషన్ భగీరథ మంచినీటి పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. నేడు ఈపథకం తెలంగాణ రాష్ట్రమంతా విస్తరించిందన్నారు. స్వచ్ఛమైన మంచినీరు మిషన్ భగీరథ ద్వారానే వస్తుందన్నారు. ప్రజలంతా మిషన్ భగీరథ మంచినీటిని సేవించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ బాగా పని చేస్తున్నారని వారిని అభినందించారు. మిషన్ భగీరథలో పని చేస్తున్న ఉద్యోగులందరికి త్వరలోనే ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని జడ్పీటిసి సభ్యులు సూచించగా అందుకు కాంట్రాక్టర్ సమ్మయ్య ఇన్సూరెన్స్ పథకం అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, కోయిల్‌కొండ గ్రామ సర్పంచ్ బి.కృష్ణ, మండల సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భీంరెడ్డి, కానాయపల్లి నాగన్న, మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ రాఘవేందర్, మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ ఉద్యోగులను సన్మానిస్తు ప్రజాప్రతినిధులు

# బల్సుపల్లిలో పోలీసుల కార్డెన్‌సెర్చ్.. సైబర్‌నేరాలపై అవగాహన..

**దేవరకద్ర, జూన్ 18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం బల్సుపల్లిలో శనివారం రాత్రి పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటివద్దకు పోలీసులు వెళ్ళి వారితో మాట్లాడారు. సరైన పత్రాలు లేని వాహనాలు, ద్విచక్రవాహనాలను గర్తించడం జరిగింది. అలాగే సైబర్‌నేరాలపై గ్రామస్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూత్‌పూర్ సిఐ రజితారెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ సమిష్టిగా పాటుపడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో గ్రామస్తులు ఉండేలా ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. సైబర్‌నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ విషయంలో గ్రామస్థులు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వెంకటేశ్‌తో పాటు భూత్‌పూర్ సర్కిల్‌లోని 4గురు ఎస్ఐలు దాదాపు 25 మంది పోలీసులు పాల్గొన్నారు.



బల్సుపల్లిల్లో వివరాలు తెలుసుకొంటున్న పోలీసులు

# జెర్రిపోతులను బంధించిన స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సాగర్

**వనపర్తి టౌన్, జూన్18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాజపేట గ్రామంలో ఓ ఇంటి ఆవరణంలో ఉన్న జెర్రిపోతులను స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సాగర్ ఆదివారం బంధించారు. ఇదే గ్రామానికి చెందిన వడ్డె శాంతమ్మ ఇంటి ఆవరణంలో రెండు పెద్ద పాములు సంచరిస్తుండడంతో శాంతమ్మ భయాందోళనకు గురై సర్పంచ్ భర్త మాధవరెడ్డికి సమాచారం అందించడంతో సర్పంచ్ వెంటనే స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ సాగర్ కు సమాచారం అందించడంతో స్పందించిన కృష్ణ సాగర్ రాజపేట గ్రామానికి చేరుకుని జెర్రిపోతులుగా గుర్తించి పాములను బంధిస్తుండగా ఒక పాము తప్పించుకుని పారిపోయింది. ఈ సందర్భంగా కృష్ణ సాగర్ మాట్లాడుతూ... తప్పించుకున్న పాము నాగుపాము కాదని జెర్రిపోతు పామేనని ఎవ్వరూ భయపడవద్దని ఆయన ధైర్యమిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ క్రైమ్, డయల్ 100, బాల్య వివాహాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్, సెల్‌ఫోన్‌లోకి పంపించే అపరిచిత వ్యక్తుల మెసేజ్‌లను ఓటీపీ పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంజ్ జ్యోతి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్వేత, సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు ఏర్పుల గోపాల్, అవినాష్ సాగర్, రాజపేట గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జెర్రిపోతును బంధిస్తున్న స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షులు కృష్ణ సాగర్

## జోగులాంబను దర్శించుకున్న తీగల కృష్ణారెడ్డి



**అలంపూర్, జూన్ 18 ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి ఆదివారం సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవాలయ ఛైర్మన్ పురందర్ కుమార్ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి ఉభయ దేవాలయాలలో అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు స్వామివారి శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో సీతారామిరెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**వనపర్తి ప్రతినిధి, జూన్18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఉన్నందున నేడు (సోమవారం) నిర్వహించి ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే ఫిర్యాదుదారులు గమనించాలని, సోమవారం తమ ఫిర్యాదులతో కలెక్టరేట్‌కు రావద్దని ఆయన తెలిపారు.

## దేవరకద్రలో ఘనంగా మంచినీళ్ళ పండుగ



**దేవరకద్ర, జూన్ 18 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఆదివారం మంచినీళ్ళ పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామపంచాయతీ అధ్వర్యంలో ప్రతిరోజు ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్, సంబంధిత అధికారి కీర్తితో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు అలాట్‌మెంట్ ఆర్డర్ పొందాలి..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** 2023-24 విద్యా సంవత్సరానికి గానూ కార్పోరేట్ ఇంటర్మీడియెట్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో ఎంపికైనట్లు మొబైల్ ఫోన్లలో మెసేజ్ పొందిన విద్యార్థులు సోమవారం సంబంధిత ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగుల కార్యాలయంలో వారికి చెందిన ఒరిజినల్ ధ్రువ పత్రాలను సమర్పించి అలాట్‌మెంట్ ఆర్డర్ పొందాలని ఎస్సీడీడీ ఉప సంచాలకులు వీ పాండు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## సత్తా చాటిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థి టాపర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త:** ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డే ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని గోదల్‌కుచెందిన వావిలాలచిద్విలాస్‌రెడ్డి టాపర్‌గా నిలిచారు. జేఈఈ మెయిన్స్‌లో మొదటిర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు రాజేశ్వర్‌రెడ్డి నాగలక్ష్మిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో శిక్షణ తీసుకొని జేఈఈ పరీక్ష రాశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో గోదల్ విద్యార్థి వావిలాల చిద్విలాస్‌రెడ్డి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి మొదటి ర్యాంక్ సాధించి గ్రామ ప్రతిష్టను జాతీయ స్థాయిలో తెలిసే విధంగా చేసిన విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.



## నీటినిర్వహణ సిబ్బందికి సన్మానం



**దేవరకద్ర, జూన్18 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఆదివారం పట్టణంలో నీటిని సరఫరాచేసే నీటినిర్వహణ సిబ్బందిని ఘనంగా సన్మానించా రు. మంచినీళ్ళ పండుగ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ సన్మానకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్, సంబంధిత అధికారికీర్తితో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ముదిరాజులకు లక్ష ఆర్థిక సహాయాన్ని అందించాలి..

**వెల్దండ, జూన్18 ప్రభాతవార్త:** ముదిరాజులకు రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని అందించాలని ముదిరాజ్ యువజన సంఘం మండల అధ్యక్షులు బొక్కల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీ ఎ లోకి మార్చాలని, వృత్తి దారులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తామనడాన్ని స్వాగతిస్తున్నామని, ఆర్థిక సహాయం అందించే వర్గంలో ముదిరాజ్‌లను విస్మరించడం బాధ కరమన్నారు. రూ.1లక్ష ఆర్థిక సహాయం అందించే జాబితాలో ముదిరాజ్‌లను చేర్చి వారికి కూడా ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు.



## తొమ్మిదేండ్ల అభివృద్ధి చూసే చేరికలు..

**- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** తొమ్మిదేండ్లలో పార్టీ చేసిన అభివృద్ధి , సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిరంతరంగా పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మండలం లింగం పేట గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌పార్టీల 30మంది యువ నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో పార్టీలో చేరారు. అదేవిధంగా బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామానికి చెందిన సుమారు 100మంది కాంగ్రెస్, బీజేపీ యువనాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందని, పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, ఎప్పటికప్పుడు పార్టీకార్యక్రమాలు, పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మంచి భవిష్యత్తు ఉన్నపార్టీ అని ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంద న్నారు. కార్యక్రమంలో లింగంపేట యువ నాయకుడు జంగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హామీలే తప్ప దళితులకు అన్యాయమే..

**- బీజేపీ ఎస్సీ మోర్చా యువ సమ్మేళనంలో జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** టీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం హామీలు తప్ప ఎస్సీలకు న్యాయం చేయలేదని , కేసీఆర్ ప్రభుత్వానిక వ్యతిరేఖంగా పోరాటం చేయాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లాకార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్సీ మోర్చా యువ సమ్మేళనానిక ముఖ్యఅతిథులుగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబేద్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చింది బీజేపీ ప్రభుత్వమని, అంబేద్కర్ విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేసిన ఘనత మోడీ ప్రభుత్వానిదే అన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలకు , కార్యక్రమాలఉుక కేంద్రం వాటా ఎక్కువ ఉందని తెలిపారు. ప్రతి గ్రామంలో బీజేపీని బలోపేతం చేసే విధంగా ఎస్సీ మోర్చా ముందుండి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల కృష్ణ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి విజయ్‌కుమార్, నారాయణపేట ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కృష్ణ, జిల్లా పదాధికారులు రామాంజనేయులు, నాగరాజు, శ్రీరాములు, మన్యం, చిన్నప్ప, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రాములు, యాదయ్య, శివ, ఆంజనేయులు, రామకృష్ణ, అంజి పాల్గొన్నారు.



## టీడీపీ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా అండేకార్ యాదిలాల్ నియామకం...

**కల్వకుర్తి, జూన్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి కల్వకుర్తి పూర్వపు నియోజకవర్గంలోని ఆ మనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, టీడీపీ కల్వకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ నియమితులయ్యారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన సమావేశమై రాష్ట్ర లీగల్ సెల్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో యాదిలాల్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో టీడీపీ బలోపేతం ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా యాదిలాల్ నియామక పత్రాన్ని అందుకున్నారు. యాదిలాల్, టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రసన్న, టీడీపీ జిల్లా నాయకులు కాలే మల్లయ్య, సత్యనారాయణ, అర్థం నరసింహ, కండె భాస్కర్, శ్రీధర్, వెంకటేష్, కుమార్‌గౌడ్‌లు కాసాని జ్ఞానేశ్వర్‌ను అభినందించి సత్కరించారు.



## తాగునీటి గోస తీరింది..

**నీళ్ల పండగ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీటిసి,ఎంపిపి**

**గండీడ్, జూన్ 18 ప్రభాతవార్త :** గ్రామాల్లో ప్రజలు తాగునీటికి చాలా తిప్పలు పడ్డారని, నీళ్ల ట్యాంకర్ల వద్ద ఆడబిడ్డలు కొట్లాడుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ దుస్థితి ఉందా అని ప్రజలు ఆలోచించాలని జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గండీడ్ మండలంలో కొమిరెడ్డిపల్లి, జంగంరెడ్డిపల్లి, రెడ్డిపల్లి గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన నీళ్ల పండగ కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ దూరదృష్టితో మిషన్ భగీరథ పథకం ద్వారా నేడు ప్రతి ఇంటికి తాగునీళ్లు అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి పంచాయతీకి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మించి తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిపి మాధవి, జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపిపి ఈశ్వరయ్యగౌడ్, రైతుబంధు అధ్యక్షుడు గోపాల్, ఎంపిడిఓ రూపేందర్‌రెడ్డి, ఏఈ గణేష్, ఏపిఎం, టిఆర్ఎస్ నాయకులు, గ్రామ యువకులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



### రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్

## ఛాలెంజ్ పోటీలకు జిల్లా నుంచి ఎంపిక

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త :** స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2022,23 రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లానుంచి ఒక ఆలోచనకు ఎంపికైనట్లు డిఈఓ రవిందర్, ఏఎంఓ విద్యసాగర్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉట్కూర్ మండలం చిన్నపొర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిన్‌విల్ గెలాక్సీ టీం నవిత, స్వాతి, శివ, అనిల్‌లు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో దాదాపు 17వేల ఆలోచనల నుండి 70 ఎంపిక కాగా అందులో జిల్లా నుండి ఒక్కటి స్థానం దక్కించుకున్నది అన్నారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లో బూట్ క్యాంపు జరగనుందని ప్రాజెక్టు రూపకల్పన చేస్తారన్నారు. అక్కడే తుది ఫైనల్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో సహా మార్గదర్శులుగా నిలిచిన ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



## వృద్ధులకు అన్నదానం, పండ్ల పంపిణీ

**వనపర్తి వైద్య విభాగం, జూన్18, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు హరి ముదిరాజ్ చేయూత ఆశ్రమ వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఆదివారం తన పుట్టిన రోజు సందర్భంగా జిల్లా జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు, జిల్లా కేంద్రంలోని చేయూత ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. అనంతరం వారితోనే కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా హరి ముదిరాజ్ మాట్లాడుతూ... పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులు బంధువులతో హంగు ఆర్భాటాలతో కాకుండా మిత్రులతో కలిసి చేయూత అనాధ ఆశ్రమంలో , వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా తన పుట్టిన రోజు వేడుకలు ఇలాగే జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సూర్యవంశం గిరి, నారాయణదాస్ కిట్టు, బీఆర్ఎస్ టీం కెప్టెన్ బెక్కరి రాము తదితరులు పాల్గొన్నారు.



# వ్యాయామం చేసి ఆయురారోగ్యాన్ని పెంపొందించుకోవాలి..

**- ఉదయాన్నే కాలి నడక, వ్యాయామం జీవితంలో భాగం కావాలి**

**- కొత్తకోట నుండి వనపర్తి వరకు నడుచుకుంటూ వచ్చి యోగ గొప్పతనాన్ని వివరించడం శుభ పరిణామం**

**- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి ప్రతినిధి, జూన్18, ప్రభాతవార్త:** ప్రతినిత్యం కనీస వ్యాయామం చేసి ఆయురారోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులు సుమారు 70 మంది కొత్తకోట నుండి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, వనపర్తి వరకు 17 కి.మీ. వాకింగ్ చేస్తు రావడంతో పట్టణ శివారులో జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ తదితరులు అడ్డం వెళ్లి స్వాగతం పలికారు. శివారు నుండి ఐడివోసి వరకు మార్నింగ్ వాక్ చేస్తు చేరుకున్నారు. అనంతరం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ సమక్షంలో ఆరోగ్య యోగ ఆసనాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఉదయాన్నే కాలి నడక అనంతరం కొంత వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిం చారు. ఉదయాన్నే కాలి నడక, తగిన వ్యాయామం జీవితంలో భాగం కావాలని తెలిపారు. కొత్తకోట నుండి వనపర్తి వరకు నడుచుకుంటూ వచ్చి యోగ గొప్పతనాన్ని ఈ రకంగా వివరించడం చాలా మంచి పరిణామమని వనపర్తి పట్టణంలో సైతం ఒక యోగా వాకింగ్ క్లబ్ ఏర్పాటు చేసి పట్టణ ప్రజలను యోగా వాకింగ్ వైపు ప్రోత్సహించాలని తెలిపారు. ప్రపంచ మానవాళి ఆరోగ్యాన్ని యోగ ద్వారా అందించిన భారతదేశ గొప్పతనాన్ని వక్తలు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్, డాక్టర్ మురళీధర్, సత్తార్, శంకర్ గౌడ్, మొదలైన వారితో పాటు ఆరోగ్య వాకింగ్ క్లబ్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, సభ్యులు రవి, రామకృష్ణ, బాలకృష్ణ, మేఘారెడ్డి, ఆంజనేయులు, రాములు యాదవ్, నవీన్, ఎల్లయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



యోగ ఆసనాలు చేస్తున్న కొత్తకోట వాకింగ్ క్లబ్ సభ్యులు

# ప్రతి గూడెం, తండాకు కమిటీలు వేయాలి..

**- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్**

**- పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** జిల్లా ఆదివాసీ నాయకులు ప్రతి మండలం, గూడెం, తండాలకు పర్యటించి కమిటీలు వేయాలని ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ కమిటీలు త్వరితగతిన ఏర్పాటు చేసుకొని ఎన్నికలకు సన్నద్ధం కావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తండాలకు పంచాయతీలు చేశామని బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం తప్ప తండాలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. తండాలు నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయన్నారు. తొమ్మిదేండ్ల పాలనలో ఏఒక్క తండాలోనూ ఒక్క పాఠశాల నిర్మించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రద్దు చేసి ఎస్టీలను బీఆర్ఎస్ నిలువునా మోసంచేసిందని పేర్కొన్నారు. పార్టీ పటిష్టతకు ఆదివాసీ కమిటీలు దోహదం చేస్తాయని త్వరగా కమిటీల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం, డబుల్ బెడ్రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు పథకాలతో మోసం చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. గతంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచితకరెంట్, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. రేపు అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 2లక్షల ఉద్యోగాల భర్తీ హామీలకు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగం నాయక్, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు అనిత, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి

# ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి ఘన సన్మానం...



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న రైతులు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జూన్ 18 ప్రభాతవార్త:** వెల్దండ మండలం చెర్కూర్ గ్రామంలో కేఎల్ఐ డీ-82 ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోయిన రైతులకు భూ నష్ట పరిహారం అందించడంలో కీలకంగా వ్యవహరించిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆదివారం గ్రామ రైతులు ఎమ్మెల్సీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రాజెక్టులో భూములు కోల్పోయి చాలా ఏళ్లు గడుస్తున్న నష్ట పరిహారం రాక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మీ సహకారంతో నష్ట పరిహారం అందిందన్నారు.

**సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత...** వెల్దండ మండల ఎంజీ కాలనీ తాండకు చెందిన పన్నీకి మంజూరైన రూ.26వేలు, ఆర్. వెంకటయ్యకు రూ.28వేల చొప్పున మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారు మెరుగైన వైద్య చికిత్సలు చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా కల్వకుర్తి పూర్వపు నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీను తల్లి మృతి చెందడంతో శ్రీను కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షల కరపత్రాలు విడుదల

**కల్వకుర్తి, జూన్ 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ చేపట్టిన రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షల కరపత్రాలను యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు రాపోతు అనిల్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా, తెలంగాణ యువత మేధో సామర్థ్యాన్ని గుర్తించి వారిని ప్రోత్సహించడానికి క్విజ్ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షలో భారతదేశ చరిత్ర, స్వాతంత్రోద్యమం, తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, వర్తమాన అంశాలు తదితర జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఉంటాయని, 60 ప్రశ్నలకు 60 నిముషాల సమయ వ్యవధి ఉంటుందన్నారు. జూలై 1 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ఉందని, 2వ తేదీన ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. 16 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు పాల్గొనవచ్చునని, 7661899899 నెంబరుకు మిస్డ్‌కాల్ ఇస్తే వెబ్‌సైట్ లింక్ మెసెజ్ రూపంలో వస్తుందని, వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అత్యధిక స్కోర్ చేసిన వారికి ప్రతి అసెంబ్లీకి అనేక ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్క యువత ఈ పోటీ పరీక్షలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెష్ మండల అధ్యక్షులు బాలరాజు, యూత్‌కాం గ్రెస్ నాయకులు జంగయ్యగౌడ్, మాలిక్, రమేష్, రంజిత్‌రెడ్డి, ఇర్ఫాన్, ప్రేమ్, సైదులు, వసురాంనాయక్, హరి, సంతోష్ తదితరులు ఉన్నారు.



పోటీ పరీక్షల కరపత్రాలను విడుదల చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

# మంచినీళ్ల పండగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నీళ్ల పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు

**ధరూర్, జూన్ 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చింతరేవుల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల భాగంగా నిర్వహించిన మంచినీళ్ల పండగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ ప్రజలు కలిసి గ్రామంలోని నీటి ట్యాంక్ వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికి తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ద ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపిపిలు నజీమున్నిసాబేగం, మనోహరమ్మ, జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపిలు సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణ నాయుడు, సర్పంచ్ శిల్పా ప్రభాకర్‌గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త:** నాగనూల్ చెరువు ఒడ్డున కుళ్లిపోయిన స్థితిలో గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహం ఎడమ చేతికి రెండు నీలం రంగు మట్టి గాజులు, గోధుమ రంగులో పంజాబి డ్రెస్ ధరించి ఉన్నది. వయస్సు 20 సంవత్సరాలకు పైబడి ఉన్నది. మున్సిపాలిటి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శవం వివరాలు తెలిసిన వారు 8712657712, 8712657711కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని ఎస్ఐ తెలిపారు.

## ఐఐటీ అడ్వాన్స్ టెస్ట్‌లో 29వ ర్యాంక్ సాధించిన జిల్లా విద్యార్థి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త:** ఐఐటీ అడ్వాన్స్ టెస్ట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన అల్లం సూజయ్ సాగర్ ఓబీసీ కోటాలో 29వ ర్యాంక్, ఆలిండియా లెవల్ జర్నల్ కోటాలో 189వ ర్యాంక్ సాధించాడు. జిల్లా కేంద్రానికి అల్లం బాల్‌సాగర్ పద్మజ దంపతుల కుమారుడు సూజయ్‌సాగర్ ఐఐటీ అడ్వాన్స్ ఫలితాల్లో ర్యాంక్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సుజయ్ 6వరకు జిల్లాలో, తర్వాత హైదరాబాద్‌లో, ఇంటర్ నారాయణకళాశాలలో చదివి ఐఐటీలు సాధించారని తల్లిదండ్రులు సూచించారు.



## ఐఐటిలో దేవరకద్ర విద్యార్థి ప్రతిభ

**దేవరకద్ర, జూన్ 18 ప్రభాతవార్త :** దేవరకద్రకు చెందిన ఓ విద్యార్థి ఐఐటిలో 2023 ఫలితాలలో ప్రతిభ కనబరిచాడు. స్థానికుడైన మేకలి వెంకటరాములు కుమారుడు అనురాగ్ యాదవ్ జాతీయ స్థాయిలో ఓపెన్ 4195, ఓబిసి 794 ర్యాంకు సాధించాడు. దీంతో విద్యార్థి అనురాగ్ యాదవ్‌ను పట్టణ ప్రజలు అభినందించారు.



## ఐఐటిలో మెరిసిన గద్వాల జిల్లా ఆణిముత్యం

**ధరూర్, జూన్ 18 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రానికి చెందిన ప్రతిష్టాత్మక ఐఐటి ప్రవేశ పరీక్షలలో జె.సాయిరాహుల్, సిద్ధార్థరెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చి ఐఐటికి ఎంపికయ్యాడు. ఐఐటి మెయిన్స్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్‌తో అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించాడు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ప్రత్యేక విభాగం కేటగిరిలో జాతీయ స్థాయిలో 17వ ర్యాంక్ సాధించాడు రాహుల్‌రెడ్డి, సీనియర్ లెక్చరర్ దివంగత జకిలేటి విష్ణువర్ధన్‌రెడ్డి కుమారుడు రాహులరెడ్డి ఉత్తమ ర్యాంక్ సాధించడంపై జిల్లా విద్యాభిమానులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. హైదరాబాద్ రోసోనిస్ మాదాపూర్ బ్రాంచ్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. ఈసందర్భంగా రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో మంచి ఇన్నోవేటర్‌గా మారి, జిల్లాకు పేరు తెస్తానని చెప్పారు. తనకు సహకరించిన కళాశాల అధ్యాపక బృందానికి, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## భక్తులతో కిటకిట లాడిన దేవాలయం

**మల్దకల్, జూన్ 18 ప్రభాతవార్త :** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం దేవాలయంలో అర్చకులు, వాల్మీకి పూజారులు అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గద్వాల కాకతీయ టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్య చంద్రారెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు.



**అలరించిన హరికథ శ్రవణం...**

అమావాస్య పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర స్వామి వైభవం హరికథ కాలక్షేపాన్ని ప్రముఖ హరికథ భాగవతం ఎం. ఆంజనేయులు నిర్వహించగా హార్మోనియం హెచ్ఎం సుధాకర్, తబలా బండలయ్యలు సహకరించారు. రాత్రి శాంతినగర్‌కు చెందిన శివశివాని టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## శవపేటిక అందజేత

**గండీడ్, జూన్ 18 ప్రభాతవార్త :** వెన్నచేడ్ గ్రామంలో ఆదివారం గుర్రాల చెన్నయ్య తండ్రి పెద్ద హన్మయ్య గ్రామానికి ఆదర్శంగా నిలిచి వాళ్ల అమ్మ భీమమ్మ సొంత ఖర్చుతో వెన్నచెడ్ గ్రామ పంచాయతీకి గ్రామ ప్రజల అవసరం కొరకు శవపేటికను దాతగా అందించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సెక్రెటరీలు, పెద్దలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలందరు గుర్రాల చెన్నయ్యకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సెక్రెటరీ పెద్దలు, యువకులు ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలందరూ గుర్రాల చెన్నయ్యకు ధన్యవాదాలు తెలిపి శవపేటికను గ్రామ పంచాయతీకి అప్పగించారు.



## మహిమాన్వితం శ్రీరామకొండ దివ్యక్షేత్రం

**భక్తులతో పులకించిన శ్రీరామకొండ**

**ఆదివారం అమావాస్యకు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం**

**కోయిల్‌కొండ,జూన్ 18 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కోయిల్‌కొండకు అతి సమీపంలో వెలసిన మహిమాన్వితమైన శ్రీరామకొండ దివ్యక్షేత్రానికి ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీరామ కొండలో వెలసిన శ్రీసీతారాములను దర్శించుకుని కొండపై ఉన్న శ్రీరాముని పాదాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం అమావాస్య నాడు శ్రీరామకొండలో వెలసిన శ్రీ సీతారాములను దర్శించుకుంటే కోరిన కోరికలు ఇట్టే నెరవేరుతాయని ప్రజలు బలంగా నమ్ముతారు. దర్శనం అనంతరం భక్తులు తిరిగి వెళ్లేటప్పుడు కొండలో వెలసిన చెట్ల ఆకులను ఇంటికి తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నవోదయ ఆసుపత్రి యాజమాన్యం వచ్చిన భక్తులకు పులిహోర ప్యాకెట్లను, అంబలి, మంచినీటిని పంపిణ చేశారు.

18ఎంబిఎన్ఆర్ 4: పులిహోర, అంబలి పంపిణీ చేస్తున్న దృశ్యం

18ఎంబిఎన్ఆర్ 5: శ్రీరామకొండపై భక్తజనసందోహం

18ఎంబిఎన్ఆర్ 6: శ్రీరామ కొండలో వెలసిన సీతారాములు

## ఆజాద్‌నగర్‌లో వెలసిన ఉమామహేశ్వరంలో అన్నదానం



**నారాయణపేట ప్రతినిధి,జూన్ 18 ప్రభాతవార్త :** పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో వెలసిన శ్రీ ఉమామహేశ్వరాలయంలో అమావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామివారికి తెల్లవారుజామున 4.30 గం.లకు మహన్యాసపూర్వక అభిషేకం నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని పలువురు భక్తులు స్వామివారికి అభిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అమావాస్యను పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు శ్రీ ఉమా మహేశ్వరులకు అభిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అమావాస్య వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, భజన కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం 1 గం.లకు మహా మంగళహారతి అనంతరం అన్నదాన కర్తలుగా పాండురంగ మెడికల్ నిర్వాహకులు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిద్ధిరామయ్యస్వామి, ఆలయ కమిటి సభ్యులు బి. ఆంజనేయులు సూర్య, పోలేపల్లి అనంతకుమార్, చిన్నకృష్ణయ్య, బి. శ్రీనివాసులు, నారాయణరెడ్డి, అభిలాష్, తిప్పిరెడ్డి, నీలి నాగరాజు, పెద్దబోయ వెంకటేష్, బి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానకర్త దంపతులను ఆలయ కమిటి ప్రక్షాన అర్చకులు సిద్దరామయ్య స్వామి శాలువాతో ఘనంగా సత్కరించారు.

## చండీయాగంలో పాల్గొన్న దేవాలయ ఛైర్మన్

**అలంపూర్,జూన్ 18 ప్రభాతవార్త :** అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠం తెలంగాణలోని ఏకైక శక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి దేవాలయం. ఈ దేవాలయంలో చండీయాగం ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఛైర్మన్ కృష్ణయ్య, ఈఓ పురందర్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు జోగులాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి దేవాలయాలలో అభిషేకాలు కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రాలతో చండీహోమం నిర్వహించగా 261 మంది దంపతులు పాల్గొని హోమం నిర్వహించారు. మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయం వ్యవస్థాపక వంశీయులు శ్రీకృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు, పద్మావతమ్మ కుటుంబ సభ్యులు చండీహోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఈఓ ప్రహ్లాదరావు కుటుంబాన్ని శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధాన అర్చకులు ఆనందశర్మ గృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా మాట్లాడారు.

## ఆర్థిక సాయం అందించిన ఎంపీపీ మేఘారెడ్డి

**వనపర్తి టౌన్ ,జూన్18,ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని 21వ వార్డు, హరిజనవాడలో బంకలి ఎల్లమ్మ మృతి చెందడంతో , ఈ విషయాన్ని కౌన్సిలర్ వెంకటేష్ వనపర్తి నియోజకవర్గ నాయకులు , పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు.మాజీ కౌన్సిలర్ గంధం కొండయ్య ద్వారా దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో కౌన్సిలర్ వెంకటేష్, టీఎంఆర్ యువసేన నాయకులు నాగన్న,విజయ్ తదితరులు ఉన్నారు.

**పెబ్బేరులో ...** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు అంబేద్కర్ నగర్‌లో గత వారం అనారోగ్యంతో మృతి చెందిన ఈరపాగ ఆంజనేయులు మరణవార్త వారి కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న వనపర్తి నియోజకవర్గ నాయకులు, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి మృతుని కుటుంబ ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని దహన సంస్కారాల నిమిత్తం ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద కాలంలో మేఘారెడ్డి చూపిన మానవత్వానికి మృతుని భార్య సునితతో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సాయం అందించిన వారిలో మేఘారెడ్డి యువసేన నాయకులు నందిపేట తిరుపతయ్య, గణేష్ సిద్ది అశోక్, ఖాసీం, నరసింహ, చిట్టెమనమ, హమీన్, రాజు, ఈరపాగ రాముడు, సాయిప్రసాద్, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

## గోవిందా... గోవిందా... కురుమూర్తి వాసి గోవిందా

**భక్తులతో కిక్కిరిసిన కురుమతి గిరులు**

**చిన్నచింతకుంట,జూన్ 18 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్యదైవం, కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ కురుమూర్తి కొండ భక్తులతో కిక్కిరిసిపోయిపోయింది. ఆదివారం అమావాస్య కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే కురుమూర్తి కొండకు చేరుకున్నారు. కొండ దిగువ నుంచి స్వామివారి సన్నిధి వరకు భక్తులు బారులు తీరి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీకురుమూరిన స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైగల ఉద్దాల మండపంలో స్వామివారి పాదుకలను తాకి భక్తులు పునీతులయ్యారు. కొండ దిగువ ప్రాంతం భక్తుల కోలాహలం నెలకొంది. భక్తుల గోవింద నామస్మరణతో కురుమతి గిరులు పులకరించాయి.

## మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**చిన్నచింతకుంట,జూన్ 18 ప్రభాతవార్త :** ఇటీవల అనారోగ్యంతో మృత చెందిన మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదివారం భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షులు, జడ్చర్ల ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి పరామర్శించారు. మండలంలోని పర్కాపూర్ గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని దయాకర్‌రెడ్డి సతీమణి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డిని పరామర్శించి ప్రజల మధ్య ఉండే మంచి నాయకున్ని కోల్పోయామని, కుటుంబ సభ్యులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత కేసు నమోదు

**చిన్నచింతకుంట,జూన్ 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పల్లమర్రి గ్రామ సమీపంలో గల ఊకచెట్టు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వి.మోహన్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దేవరకద్ర మండలం గూరకొండ గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఆదివారం మండలంలోని పల్లమర్రి గ్రామం సమీపంలో గల ఊకచెట్టువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ యజమాని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఓటరు నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ఉట్కూర్,జూన్ 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో రెండవ విడత ఓటరు నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన వారి వివరాలు ఫార్మ్ 6 లో కొత్త ఓటరు నమోదు చేయాలని అలాగే మార్పులు ఏమైనా ఉన్నచో ఫార్మ్8లో, చనిపోయిన వారు ఉంటే ఫార్మ్ 7లో చనిపోయనట్లుగా ధృవీకరణ పత్రాన్ని తీసుకుని ధృవీకరణ పత్రం లేనిచో ఇంట్లో ఉన్న వారితో ధృవీకరించుకోవాలన్నారు.రెండవ విడత ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఒక్క ఇంట్లో ఆరుగురు కంటే ఎక్కువ ఉన్న ఓటర్ల ఇంటింటి సర్వేను పరిశీలించారు. బిఎల్‌ఓలు చేస్తున్న ఇంటింటి సర్వేను చూసి అభినందించారు. ఈ సందర్భంగా ఉట్కూర్ తహసిల్దార్ తిరుపతయ్య, నారాయణపేట తహసిల్దార్ దానయ్య, ఆర్‌ఐ రాఘవేందర్‌రెడ్డి, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి

**వనపర్తి టౌన్,జూన్18,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం టీఎస్ యుటీఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అనేక పాఠశాలల్లో స్కావెంజరన కొరత ఉందని, ఊడ్చే నాథుడు కరువయ్యారని, మన ఊరు మన బడి పాఠశాలకు మంజూరైన నిధులు కన్‌స్ట్రక్షన్ కి నోచుకోలేదని నేటికి చాలమంది కాంట్రాక్టర్లు పన్నులు కట్టడానికి ముందుకు రావడం లేదని అన్నారు. ఉపాధ్యాయుల వివిధ రకాల బిల్లులు ఈకుబేరులో పేరుకుపోయయని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ సకాలంలో అందజేయాలని కోరారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించాలని లేనిపక్షంలో ఉపాధ్యాయ సంఘాలతో పోరాటాలకు సిద్ధంకావాల్సి వస్తుందని హెచ్చరించారు. గత కార్యకలాపాల నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య ప్రవేశ పెట్టారు. అనంతరం సెక్టోరియల్ అధికారిగా ఎంపికైన శేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జ్యోతి, హనుమంతు, లక్ష్మణ్ నాయక్, వెంకటేష్, మురళి, రామన్ గౌడ్, అరుణ, వెంకటస్వామి, బక్కన్న, బాలీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలు అన్ని గ్రామాలకు అందాలి..

**- ప్రభుత్వ పథకాలు ప్రజలకు గ్రామాల కార్యకర్తలు తెలపాలి**

**- బీఆర్ఎస్ వద్దు బీజేపీ ముద్దు**

**- విజయవంతంగా పెద్దమందడి మండలంలో బైక్ ర్యాలీ**

**- మండల ప్రజలతో మాటమంతి**

**బీజేవైఎం వనపర్తి జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞరెడ్డి**



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు



బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞరెడ్డి

**వనపర్తి ప్రతినిధి,జూన్18,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పలు గ్రామాలలో ఆదివారం బీజేవైఎం వనపర్తి జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ , బీజేవైఎం కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుజ్ఞరెడ్డి మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి తెలంగాణ ప్రభుత్వానికి భారీ మొత్తంలో పథకాలు అమలు పరుసునతన్న రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు లేకుండా కేంద్రం నుండి వచ్చిన నిధులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పథకాల పేర్లు మారుస్తు రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందని ప్రజలకు అబద్దాలు చెబుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ వద్దు బీజేపీ ముద్దు తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు కొత్త పంథాలో ప్రయాణిస్తున్నాయి. తెలంగాణను కవులు అమ్మతో పోల్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పాలకులు తెలంగాణను తల్లిలా భావిస్తున్నారా.. అంటే నూటికి నూరు శాతం భావించడం లేదని చెప్పాలి. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలను నడుపుతున్నారు. ప్రజలకు ఉచితాల రుచి చూపుతూ, పబ్బం గడుపుకుంటున్నారు. నివసించే గ్రామాన్ని , దేశాన్ని తల్లిగా భావించే బీజేపీని దోషి గా చూయించి, అధికారంలోకి రానివ్వకుండా పలు విన్యాసాలకు పాల్పడుతున్నారు. ఎన్ని విన్యాసాలు చేసిన, బీజేపీ 2024లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయం అని పలు సర్వేలు చూయిస్తున్న కారణంగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు చీకటి ఒప్పందాలకు దిగుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు పలు వేదికల్లో కాంగ్రెస్‌తోనే మాకు పోటీ అంటూ మాట్లాడుతూ బీజేపీ బలంగా లేదనే భావన ప్రజల్లో కలిగేటట్లు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు దీన్ని గమనిస్తున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, బహుళ కమ్యూనిస్టులు అంతా ఒక తాను ముక్కలే. వీరికి బీజేపీ శత్రువు. ఎందుకంటే దేశాన్ని తల్లిగా భావించే విధానం, తీవ్రవాదాన్ని తుడిచిపెట్టే విధానం, ఈ దేశ పౌరులంతా ఒకటే అన్న భావన, కుంభకోణాలు లేని, అవినీతి లేని పాలన లాంటివి బీజేపీ అనుసరించడం కారణంగా పై పార్టీలన్నీ బీజేపీతో శత్రుత్వాన్ని పెంచుకున్నాయి. దేశమేమైతే మాకేంటి మేము మా పార్టీలు బాగుంటే చాలు అన్న విధానం బీజేపీ కూడా అనుసరిస్తే, అన్ని పార్టీలు బీజేపీతో కలిసి వచ్చేవి. 75 సం.ల స్వతంత్ర భారతంలో ప్రపంచ దేశాలలో మునుపెన్నడూ భారతదేశానికి దక్కనంత ఘనత నేడు బీజేపీ ఏలుబడిలో లభిస్తుంటే ఓర్వలేక పై పార్టీలన్నీ ఏకమై, బీజేపీని ఒంటరిని చేసి ఓడించాలని చూస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఉచితాల పేరుతో కుల సంఘాల వారికి రుణాలు ఇవ్వచూపి, తిరిగి అధికారంలోకి రావాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్‌ను నమ్మవద్దని , కాంగ్రెస్ పార్టీ నాయకులను నమ్మి ఓట్లు వేస్తే తిరిగి బీఆర్ఎస్‌లోనే చేరుతారన్న దానిని గమనించాలి. రెండు పార్టీలు వీధుల్లో కుస్తీ పార్టీ కార్యాలయాల్లో , విందు వినోదాల్లో దోస్తీ అనే ధోరణి లో ఉన్నాయి. యువకుల్లారా గమనించండి.

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేయండి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని అధిక మెజారిటీతో గెలిపించగలరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పూరి చెన్నయ్య, తిరుపతయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు శశివర్ధన్, ఉపాధ్యక్షులు రుక్మారెడ్డి, రాజేష్, తిరుపతి, శంకర్ గౌడ్, అమ్మపల్లి రాములు, మండల ఉపాధ్యక్షుడు అశోక్ , రాము, నరేష్, శేఖర్, సతీష్, పామిరెడ్డిపల్లి చందు, రవి , పార్టీ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శక పాలన అందించేందుకు సమీకృత కలెక్టర్ కార్యాలయం

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్**



ఫిల్టర్ బెడ్‌కు నీరు పడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**నారాయణపేట ప్రతినిధి,జూన్ 18 ప్రభాతవార్త :** ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు జిల్లాకు ఒక సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మించడం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్ కార్యాలయం నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా పిల్లర్లకు నీరు పట్టించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలలో సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మించి అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే దగ్గర పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు అయిన నారాయణపేట జిల్లాలో ఐడిఓసి కార్యాలయం ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్ బిడిఈ రాములు, తహసిల్దార్ దానయ్య ఉన్నారు.

## రేపటి వరకు లైట్లు వేయకుంటే నాకు కాల్ చేయండి..

**వెంకటేశ్వర కాలనీ మహిళలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భరోసా**



సిసిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూన్ 18 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్, కాటన్‌మిల్ సమీపంలో, పిల్లలమర్రి రోడ్ వద్ద రూ. 28.57 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు పనులను మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమానికి వెంకటేశ్వర కాలనీకి చెందిన మహిళలు కూడా హాజరయ్యారు. స్థానికంగా ఉన్న తమ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో ఉన్న పట్టణ ప్రకృతివనం వద్ద స్థానిక మహిళలు గతకొన్ని రోజులుగా లైట్లు వెలగడం లేదని మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వెంటనే సంబంధిత సిబ్బందిని పిలిపించి రేపటి వరకు అక్కడ లేట్లు పడేలా చూడాలని మంత్రి ఆదేశించారు. సిబ్బంది ఫోన్ నంబర్‌ను స్థానిక మహిళలకు తెలిపి పని అయ్యేవరకు వారికి ఫోన్ చేయాలని అయినప్పటికి వారు గనక స్పందించని పరిస్థితి వస్తే తన నంబర్‌కు కాల్ చేయాలని వచ్చి దగ్గరుండి లైట్లు వేయించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, కౌన్సిలర్ రోజా, తిరుమల, వెంకటేష్, కమిషనర్ ప్రదీప్‌కుమార్, నాయకులు రవి, బ్రహ్మం, వెంకటస్వామి, శేఖర్, సాయిలు, సత్యనారాయణ, వెంకటేష్, షాబుద్దిన్,భూపాల్, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హరితోత్సవం పండుగ వాతావరణంలో నిర్వహించాలి: కలెక్టర్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా సోమవారం నిర్వహించే తెలంగాణకు హరితోత్సవం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ జి రవినాయక్ ఆదేశించారు. హరితోత్సవం , విద్యా దినోత్సవం ఆధ్యాత్మిక దినోత్సవం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహణ విషయమై ఆదివారం ఆయన జిల్లా స్థాయి సంబంధిత అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో హరితహారం కిందనాటిన మొక్కలపై దృష్టి సారిస్తూ అన్ని గ్రామాలు,సంస్థలు, అన్నిచోట్ల మొక్కలు నాటాలన్నారు. గ్రామాలు పట్టణాలతో ప్రకృతి వనాలతో తోరణాలతో అలంకరించాలని, పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించాలన్నారు. అలాగే ఈ నెల 20న నిర్వహించనున్న విద్యా దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయి మొదలుకొని విశ్వవిద్యాలయం వరకు అన్ని చోట్ల కార్యక్రమాలను నిర్వహించాలని, అన్ని పాఠశాలల్లో రాగి జావా పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేయాలని పిల్లల యూనిఫాం,బక్కులు, పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంలో ఒక స్వీటు అందజేయాలన్నారు. 21న నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 113 దేవాలయాల్లో ధూపదీపనైవేద్యాలు జరుగుతున్నాయని, దేవాలయాలతోపాటు గురుద్వారాలు, చర్చిలు అన్నింటిలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యు అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఈవో వెంకటేశ్వర్లు,డీఈవో రవీందర్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రైతుల రుణమాఫీ చేసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకోండి

**- రైతుల నుండి బ్యాంకు అధికారులు అకౌంట్ లాక్ పేరుతో ధాన్యం డబ్బులకు ముడి పెడుతున్నారు**

**- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్**



మాట్లాడుతున్న ఎండి జబ్బార్

**వీపనగండ్ల,జూన్18,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశం కామ్రేడ్ నరసింహ భవనంలో ఎం.కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ... రైతులు పండించిన వరి ధాన్యానికి డబ్బులు వెంటనే ఖతాలలో జమ చేయాలని రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి నెల రోజులైనా రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయలేదని అన్నారు. రైతాంగం తిరిగి నాట్లు వేసుకునే సీజన్ వచ్చినప్పటికీ పెట్టుబడికి లేక ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే పెండింగ్ బిల్లులు డబ్బులు వేయాలని అన్నారు. రైతుల రుణమాఫీ చేయకపోగా అధిక వడ్డీలు వసూలు చేస్తు నడ్డి విరుస్తున్నారని అన్నారు. బ్యాంకులో రైతులకు గతంలో ఏమైనా లోన్ ఉన్నచో అకౌంట్ లాక్ పడిందని ఈ టోన్ జమ చేసినచో అకౌంట్ లాక్ ఓపెన్ చేసి మీ డబ్బులు మీకు ఇప్పిస్తు న్నామని బ్యాంకు సిబ్బంది రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. మహిళా సంఘం సభ్యులకు కూడా ఇదే విధంగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. రైతుల రుణమాఫీ చేయాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, గృహలక్ష్మి స్కీం, ఎంబీసీలకు లక్ష రూపాయలు, గొర్ల కాపరులకు గొర్రెలు అర్హులైన వారందరికీ ఇవ్వాలని జిల్లా వ్యాప్తంగా ఈనెల 22న తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణయ్య, మహబూబ్ పాషా, మురళి, సర్పంచ్ మౌలాలి, మండల నాయకులు ఈశ్వర్, ఆశన్న, శాంతమ్మ, నిరంజన్, బాలగౌడ్, రాములు, నాగరాజు, వెంకటేశ్వర్లు గౌడ్, రామకృష్ణ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి..

**శ్రీరంగాపురం,జూన్18,ప్రభాతవార్త:** బైక్ అదుపు తప్పి కిందపడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నాచహల్లి గ్రామ పరిధిలో జరిగింది. శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన జనిగే నాగన్న , తిరుపతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, రెండవ సంతానంలో రాముడు, లక్ష్మణుడు ఇద్దరు కవలలు కాగా జనిగే రాముడు (23) ఆదివారం మధ్యాహ్నం బైక్ పై వెళ్తు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతుడు వనపర్తి జిల్లా కేంద్రంలో హమాలీ పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రుల దగ్గరకి సొంత గ్రామానికి వచ్చి తిరిగి వనపర్తికి వెళ్తు నాచహల్లి గ్రామ పరిధిలో ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి రోడ్డు కిందకు పడిపోవడంతో తల, ఇతర శరీర భాగాలకు గాయాలు తగిలి తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం వెంటనే పోలీసులు మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## తాగునీటి గోస తీరింది..!

**మొదటిపేజీ తరువాయి భాగం..**



ట్రీట్మెంట్ ప్లాంటును స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో గిరిజన కార్పోరేషన్ ఛైర్మన్ వాల్యానాయక్, జడ్పీ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య, డిసిఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మిరవిందర్, సంగీత నాటక అకాడమి మాజీ ఛైర్మన్ బాద్మి శివకుమార్, జడ్పీ సీఈఓ జ్యోతి, మార్కెట్ కమిటి ఛైర్మన్ మన్నెం, గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్, సింగిల్‌విండో ఛైర్మన్ సుదర్శన్‌గౌడ్,రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు జంగయ్య,మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ డానిష్,కౌన్సిలర్లు కోట్లప్రశాంత్‌రెడ్డి,ఉమాశంకర్‌గౌడ్,నందకి షోర్‌గౌడ్, లత,బండ్లజ్యోతి, ముడా డైరెక్టర్లు శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్, ప్రీతం,ఎంపిపి సుదర్శన్, నాయకులు నాగిరెడ్డి,పిట్టల మురళి, కాట్రపల్లి లక్ష్మణ్, శంకర్‌నాయక్, హఫీజ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## శుద్ధజలం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ..!

**మొదటిపేజీ తరువాయి భాగం..**



ఉన్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించి నీటి ప్రాముఖ్యతను తెలుసుకునే విధంగా ఏర్పాటు చేయాలని మన్యంకొండ దేవస్థానం ఈఓ, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, ఎంపిపి సుధీశ్రీ, మున్సిపల్ ఛైర్మన్ ఏసి నర్సింహులు, మిషన్ భగీరథ సీఈ చెన్నారెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు వెంకట్‌రెడ్డి, పుల్లారెడ్డి, తహసిల్దార్ పాండు, ఇతర అధికారులు, డీపిఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీపనగండ్ల మండలంలో ఇంటింటికి మంచినీళ్లు



**వీపనగండ్ల,జూన్18,ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి ,రైతుబంధు సమన్వయ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, సత్యనారాయణ గౌడ్, మంచినీళ్ల పండుగ కార్యక్రమం నిర్వహిం చారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీ రథ కార్యక్రమం, ఇంటింటికి తాగడానికి మంచినీళ్ల ఇవ్వాలని, ప్రతి ఇంటికి నీళ్ల కులాయి పెట్టించారు. ఒకప్పుడు ఆడబిడ్డలు మంచినీళ్ల తాగడానికి బిందెలు తీసుకుని తెలంగాణ ఏర్పడిన తరువాత అలాంటి సమస్యలు లేకుం డా మహిళలు ఇంటింటికి నల్లా పేరుతో మిషన్ భగీరథ నీళ్ల ప్రతి ఇంటికి వచ్చేట్టుగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మంచినీళ్ల అందించడం జరిగిందన్నారు.

## మండల ఏర్పాటు కోసం రెండెకరాల భూదానం..

**స్వచ్ఛందంగా ముందుకొచ్చిన గ్రామస్తులు**



**కోయిల్‌కొండ,జూన్ 18 ప్రభాతవార్త :** మండలంలోని గార్లపాడు గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి నేతలు గత 150 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. మండల ఏర్పాటు కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షలను చూసి గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెండెకరాల భూమిని మండలం కోసం గ్రామ పంచాయతీకి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాసి ఇవ్వడం జరిగింది. గ్రామానికి చెందిన మాడా మాధవకుమార్ ఒక ఎకరా భూమిని మండల ఏర్పాటు కోసం ఆదివారం గ్రామ పంచాయతీకి రాసి ఇవ్వడం జరిగింది. గ్రామ ఎంపిటిసి విజయలక్ష్మి సత్యరెడ్డి 600ల గజాల భూమిని అరగోపాల్, డిప్యూటి ఇంజనీర్ 400 గజాల భూమిని, గ్రామ మాజీ సర్పంచ్ దస్తగిరి అర ఎకరా భూమిని గ్రామ సర్పంచ్‌కు మండల ఏర్పాటు కోసం వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లిఖితపూర్వకగా వ్రాసి ఇవ్వడం జరిగింది. మండల ఏర్పాటు కోసం భూదానం చేయడానికి ముందుకు వచ్చిన ఎంపిటిసి విజయలక్ష్మి, సత్యారెడ్డి, మాడా మాధవకుమార్,డిప్యూటి ఇంజనీర్ అరగోపాల్, గ్రామ మాజీ సర్పంచ్ దస్తగిరిలను గ్రామస్తులు అభినందించి సన్మానించారు. మండల ఏర్పాటు కోసం 15 గ్రామాల ప్రజల సంతాలు, 10 గ్రామాల పంచాయతీ తీర్మాణాలు సిద్ధంగా ఉన్నాయని మండల సాధన సమితి కన్వీనర్ కె.రామునాయక్, కో కన్వీనర్ వెంకట్రాంరెడ్డిలు తెలిపారు. మండలానికి కావలసిన అన్ని అర్హతలను సాధించామని ఇక గార్లపాడు గ్రామాన్ని మండలం ఇక గార్లపాడు గ్రామాన్ని మండలంగా ప్రటించాలని వారు ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శ్రీహరిగౌడ్, మాజీ ఎంపిటిసి నాగార్జునగౌడ్, నవీన్ పాల్గొన్నారు.